క్లుప్తంగా

ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థిక సాయం

సాలూరు: పట్టణంలోని బంగారమ్మపేటకు చెందిన ఆర్ఎంపీ టి.పోలాచారి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి 'మీకై మేము' వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు పదివేల రుపాయల నగదును మంగళవారం అందించారు.మరిన్ని స్వచ్ఛందసంస్థలు, తోటి వైద్యులు ఆయన కుటుంబానికి ఆర్థికంగా సహాయపడాలని మీకై మేము అసోసియేషన్ అధ్యక్షుడు ఇప్పిలి దిలీప్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఈశ్వరరావు, చంటి, నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సీలో చేరేందుకు 19 వరకు రిజిస్ట్రేషన్‌లు

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఆర్గానిక్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 19 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.వెబ్‌ఆప్షన్స్‌కు ఈ నెల 23నుంచి 25 వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ సదుపాయం కేవలం ప్రభుత్వ పీజీ కళాశాలలకు మాత్రమే ఉందన్నారు. ఈ అవకాశాన్ని డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వీడివీకే యూనిట్ల పరిశీలన



జీడి యూనిట్‌ను పరిశీలిస్తున్న టీడీసీసీడీఎస్ ప్రతినిధులు

సీతంపేట: మండలంలోని వన్‌ధన్ వికాస్ కేంద్ర యూనిట్లను ఒడిశాకు చెందిన ట్రైబల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు దెబతోస్ మెహతో మంగళవారం పరిశీలించారు. స్థానిక కొండచీపర్లు, జీడి యూనిట్‌లను సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న విధానాలను ఒడిశాలో కూడా అమలు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు అధికారులు పాల్గొన్నారు.

పీఎంఏవై ఇళ్లల్లో గృహప్రవేశాలు



గెడ్డతిరువాడలో పీఎంఏవై ఇంటిని ప్రారంభిస్తున్న హౌసింగ్ పీడీ కేశవనాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామంలో పీఎంఏవై పథకం కింద నిర్మించిన ఇళ్లల్లో మంగళవారం గృహప్రవేశాలు చేశారు. హౌసింగ్ పీడీ కేశవనాయుడు చేతులమీదుగా ఇళ్ల ప్రారంభం అనంతరం లబ్ధిదారులు తమ ఇళ్లల్లోకి అడుగుపెట్టారు. మండలానికి 40 పీఎంఏవై ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 15 ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడా జరిగాయని పీడీ తెలిపారు. మిగిలిన వారు కూడా నిర్మాణాలను వేగవంతం చేసి, పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, రక్తదాన శిబిరాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పుట్టినరోజు సందర్భంగా కురుపాం కోటలో ఉచిత వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరానికి వెళ్లి, రక్తం దానం చేశారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా రంజిత్‌కుమార్, డొంకాడ రామకృష్ణ, పువ్వల లావణ్య, వెంపటాపు భారతి, జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

- ఎమ్మెల్యే విజయ్ చంద్ర



పార్వతీపురం పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ చంద్ర

పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని ఎమ్మెల్యే విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్వతీపురం పట్టణలోని నాలుగు రోడ్లు కూడలి వద్ద, పార్వతీపురం మండలంలోని సంగంవలస గ్రామంలో కార్యక్రమాలు చేపట్టి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త ఎక్కడి నుంచి తయారు కాదు. మన ఇంటి నుంచే వస్తుంది కాబట్టి ఆ చెత్తను బయట పారబోసి అధ్వానంగా పరిసరాలు తయారు చేయవద్దని కోరారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు ఎదురవుతుంది. చెత్తను సంపదగా సృష్టించుకుంటే పరిసరాలు బాగుపడడంతో పాటు మంచి ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. కేంద్రప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు చేపట్టాలని సూచించిందని 15 రోజులు కార్యక్రమం కాకుండా ప్రతిరోజూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి కమిషనర్ శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఉద్యోగులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరూ భాగస్వామ్యం కావాలి

మక్కువ: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మండల కేంద్రం మక్కువలో మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలందరికీ స్వచ్ఛత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చేనెల 1వ తేదీన పంచాయతీ పరిధిలోని స్కూళ్లలో స్వచ్ఛతపై పిల్లల మనోభావాల ప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని జెడ్పీటీసీ శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, రెవెన్యూ, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంగంవలస గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

సీతానగరంలో..

సీతానగరం: జాతీయ స్థాయిలో గ్రామాల్లో ప్రారంభించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేటలో మంగళవారం సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛతా హి సేవాకార్యక్రమంలో జెడ్పీటీసీ బాబ్జీ పాల్గొన్నారు.

చెత్త రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలి

పార్వతీపురం: చెత్త రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని ఎంపీపీ ఎం.శోభారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మండలంలోని వెంకంపేట గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందిరపై ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా, డెంగీ తదితర వ్యాధులను నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తీల కృష్ణారావు, వైస్ఎంపీపీ ఎస్.జగన్నాథరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: వెంకంపేటలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ శోభారాణి తదితరులు



మక్కువలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, అధికారులు



సీతానగరం: లచ్చయ్యపేటలో సేవకార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

నులిపురుగు నివారణతోనే పిల్లల్లో ఆరోగ్యం



నిడగల్లులో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయిస్తున్న ఎంపీహెచ్ఈఓ సూర్యనారాయణ

సీతానగరం: పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పిల్లల పొట్టలో ఉన్న నులిపురుగుల నివారణకు ఉపాధ్యాయులు, పేరెంట్స్ సహకారం అవసరమని ఎంపీహెచ్ఈఓ జి.సూర్యనారాయణ అన్నారు. జాతీయ నిలిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పొట్టలో నులిపురుగులు లేకుండా జాగ్రత్తచర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో 31 అంగన్వాడీ కేంద్రాలు, 25 పాఠశాలలుండగా 1987 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేశామని తెలిపారు. ప్రతి విద్యార్థి నులిపురుగుల నివారణకు మందులు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం పాఠశాలలకు హాజరుకాని పిల్లలకు బుధవారం వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు ఆయాలు, ఆశవర్కర్లు, పేరెంట్స్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ

బలిజిపేట: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వంతరాం పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు వంతరాం ఉన్నత పాఠశాలలో వంతరాం, నారన్నా యుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే సగం మంది ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు రాయడం, చదవడం నేర్పించడం వల్ల వారిలో చదువుపై ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన అంశాలను స్కూల్ కాంప్లెక్స్‌లో చర్చించుకోవడం ఎంతో అవసరమని అభిప్రాయ పడ్డారు.

అందరం నైతిక విలువలతో పనిచేస్తే ఉపాధ్యాయుడిగా మనకు మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. ఒక విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దితే ఎంతో సంతృప్తి కలుగుతుందని చెబుతూ డిజిటల్ పాఠాల ప్రాధాన్యంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బోధనలో ఉపాధ్యాయులకు ఉండే వివిధ సమస్యలపై ఉపాధ్యాయులు చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి



బాలుర ఉన్నత పాఠశాలలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డి

పార్వతీపురం టౌన్: విద్యార్థులంతా నేత్ర పరీక్షలు చేయంచుకోవాలని జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సుకుమార్ బాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నేత్ర వైద్యపరీక్షలు ఆయన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగస్టు 1 నుంచి అక్టోబర్ 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 34,550 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి 1022 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని, శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 274 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన యువతతో ఎమ్మెల్యే తదితరులు

పాలకొండ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సత్యసాయి విద్యాసంస్థల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 17 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 695 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 274 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ యు.సాయికుమార్, సత్యసాయి విద్యాసంస్థల ప్రతినిధులు బి.లక్ష్మీనారాయణ, ఎ.శ్రీనివాస్, టీడీపీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్, గండి రామినాయుడు, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న పీడీ ఎం.ఎన్.రాణి

భామిని: గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎన్.రాణి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సంపూర్ణ పోషణ అభియాన్ సమావేశంలో ఆమె పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలేరు, భామిని పీహెచ్‌సీ వైద్యాధికారులు దీపికా రాణి, పసుపులేటి సోయల్ గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం, పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. బీసీఓ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రెంటిస్ కోసం వినతి

సీతంపేట: తామంతా స్థానిక కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేశామని, అప్రెంటిస్ శిక్షణ ఇప్పించాలని కోరుతూ పలువురు విద్యార్థినులు మంగళవారం ఐటీడీఏను ఆశ్రయించారు. సుమారు 25 మంది విద్యార్థులు ఈ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేశామన్నారు. తమకు సీతంపేట ఏరియా ఆస్పత్రిలో శిక్షణ ఇవ్వాలని విద్యార్థినులు సుజాత, సునీత, భారతి, మల్లిక, శాంతి తదితరులు అధికారులను కోరారు.

వరి పంటలో కేలీల బెడద



బుడ్డిపేటలో వరిచేనులో కేలీలు



లక్ష్మీపురంలో పొట్టదశలో ఉన్న వరి వెన్నులు

సీతానగరం: మండలంలో ఖరీఫ్ వరిసాగుచేసిన పొలాల్లో కేలీల బెడద ఎక్కువగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.2024–25 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ సమకూర్చిన వరి విత్తనాలు కొనుగోలుచేసి రైతులు వరినారు వేశారు. ఉబాలు చేసి వరిచేను పొట్టదశకు వచ్చిన సమయంలో అక్కడక్కడ వరిచేనులో చేరిన కల్తీవిత్తనాలు ఉన్నందున కేలీలు కనిపిస్తున్నాయని, వరి వెన్ను పాలు పోసుకునే దశకు రావడంతో ఏంచేయాలో తెలియకతర్జనభర్జన పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా విత్తనాభివృద్ధి సంస్థనుంచి సేకరించిన విత్తనాలు అన్నిగ్రామాల రైతులు కొనుగోలు చేశారని అయినా రెండు గ్రామాల్లో కేలీలు 5 శాతం వరకూ కనిపించాయన్నారు. రైతులు కేలీలను ముందుగా తొలగించాలని, మొత్తవరిచేను కోత కోసేవరకూ ఉంచరాదని సూచించినట్లు తెలిపారు.

రహదారి పనుల పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ బి.రవి

మక్కువ: మండలంలోని దబ్బగడ్డ గ్రామం నుంచి నగుళ్ల దబ్బగెడ్డ గ్రామం వరకు జరుగుతున్న రహదారి పనులను ఈఓపీఆర్‌డీ బి.రవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోటి 60 లక్షల నిధులతో దబ్బగెడ్డ నుంచి నగుళ్ల దబ్బగెడ్డ వరకు 2,100 మీటర్ల రహదారి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రహదారి పనులు వేగవంతంగా చేపట్టి, ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రహదారి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ చిన్నంనాయుడు, మండల జేఈ రంజిత్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ఆందోళన



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు, కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: నిత్యవసర సరుకులు(నిత్యావసరాలు) ధరలు తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పెడారపు భాస్కరరావు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పాలక సహదేవుడు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డి.సూర్యకళ డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కొత్తగా వివాహమైన గ్రామీణ కార్మికులకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఇవ్వాలని, వందరోజుల లేబర్ బడ్జెట్ పూర్తయ్యే వరకు పనులు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకంలో కేంద్రం తెచ్చిన మార్పులను రద్దు చేయాలని, వ్యవసాయ రుణాలు, పెట్టుబడి రుణాలు అందజేయాలని, మహిళా రక్షణ కోసం కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. అలాగే వీరఘట్టం, కురుపాం నియోజకవర్గంలో ఉన్న గిరిజన ఆదివాసీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, గిరిజన ప్రాంతంలో మైనింగ్ మాఫియాను అరికట్టాలని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, భూమి లేని రైతులకు రెండున్నర హెక్టార్ల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు అప్పారావుకు వినతిపత్రం అందజేశారు.

అతి అనర్థమే..

- అధికంగా ఎరువులు వాడితే పంటకు నష్టం
- పంట దిగుబడి, పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం
- మెళకువలు పాటిస్తే రైతులకు లాభం



పొలంలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న రైతు

పాలకొండ రూరల్:

అధిక వర్షాలతో పంటలకు పుష్కలమైన సాగునీరు అందింది. ఈక్రమంలో వివిధ రకాల క్రిములు, పురుగులు పంటలకు ఆశిస్తాయి. సాగులో అధిక దిగుబడులను రాబెట్టేందుకు, కీటకాలను నాశం చేసేందుకు రైతులు మోతాదు మించి ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తున్నారు. దీంతో భూ సారం దెబ్బతిని పంటల దిగుబడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా పర్యావరణానికి, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు భూముల్లో నీరు నిలిచిపోయింది. ఈ క్రమంలో పంటలను దక్కించుకునేందుకు రైతులు ఎరువులపై ఆధారపడటం సర్వసాధారణమైయ్యింది. అవసరమగు ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో సాగుభూమి

మండలం	హెక్టార్లు
పాలకొండ	7,250
వీరఘట్టం	8,997
సీతంపేట	7,702
భామిని	6,432

పరిమితికి మించితే ప్రమాదం..

పంటకు యూరియా అవసరమైన దాని కంటే ఎక్కువ వినియోగించడం వలన మొక్క మెత్తబడి చీడపురుగులు అశిస్తాయి. దీనివల పంట ఏపుగా పెరుగుతుందే తప్పా దిగుబడి కనిపించదు. అలాగే సుడిదోమ అశించే ప్రమాదం ఉంది. భూమిలో డీఏపీ(భాస్వరం) తగిన మోతాదులో వినియోగించడం వలన మొక్క వేళ్లు బలంగా తయారవుతాయి. అధికంగా వాడటం వలన ఆర్థిక భారం తప్ప ప్రయోజనం కనిపించదు. పురుగు మందులు అధికంగా వాడటం వలన పంట ఎర్రబడుతుంది. ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వలన ప్రధానంగా రైతుకు అర్థిక భారం అవుతుంది. ఆ పంట ఆరగించటం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఇలా చేస్తే మేలు..

- పంటకు అశించిన చీడపీడలను ముందుగా గుర్తించిన రైతులు వ్యవసాయాధికారులు సంప్రదించి వారి సలహాలు, సూచలను మేరకు క్రిమిసంహారక మందులు వినియోగించాలి.
- క్రిమి సంహాకరక మందులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యాతా ప్రమాణాలను కచ్చితంగా పరిశీలించాలి.
- పురుగు మందుల తయారీ, గడువు తేదీలను, ఎంఆర్‌పీ ధరలను సరిచూసుకోవాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లో ఎరువులను, పురుగు మందులను కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన వాటికి రసీదు (బిల్లు) తీసుకోవాలి. పురుగు మందుల సీసాలు సీల్‌ను, ఎరువుల బస్తాల సీల్‌ను సరిచూసుకోవాలి.
- పంటలపై పురుగు మందులను పిచికారి చేసే సమయంలో రైతులు తమ చేతులకు గ్లోవ్స్, మొఖానికి మాస్క్ ధరించాలి. క్రిమిసంహారక మందులను కలిపేటప్పుటు వాటి గాఢతను తట్టుకోనే విధంగా జాగ్రత్తలు పాటించాలి.
- పిచికారి చేసేటప్పుడు చేతులను నోటిలో పెట్టరాదు, ఆహార పదార్థాలు తీసుకోరాదు. మద్యం సేవించి ఎరువులను, పురుగు మందులను పిచికారీ చేయరాదు.
- ఎండ తీవ్రత, బలమైన గాలులు వీస్తున్నప్పుడు పురుగు మందులను స్ప్రే చేయరాదు. గాలి వీచే దిశకు పిచికారీ చేయటం శ్రేయస్కరం.
- వర్షం కురిసిన వెంటనే పురుగు మందులు పిచికారీ చేయటం వలన ప్రయోజనం ఉండదని రైతులు గుర్తించాలి.

సూచనలు పాటించాలి



మార్కెట్‌లో కొనుగోలు చేసే క్రిమిసంహారక మందులు, ఎరువుల విషయంలో అవగాహన పెంచుకోవాలి. అధికారులు సూచనలు పాటించటం వలన ప్రయోజనం ఉంటుంది. గ్రామస్థాయిలో మా సిబ్బంది రైతులకు అవసరమగు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అన్నదాతలకు అవగాహన సదస్సులు చేపడుతున్నాం.

– ఎన్ని వాహిని, వ్యవసాయశాఖ అధికారి, పాలకొండ